నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ప్రకాశం బాపట్ల
మంగళవారం 31 డిసెంబరు 2024 పేజీలు 8

# నేడు, రేపు ఎంపి మాగుంట పర్యటన



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి నేడు ఒంగోలు రానున్నట్లు కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి ప్రకటన ద్వారా తెలియజేశారు. నేడు, రేపు పర్యటన వివరాలను తెలియజేశారు. సాయంత్రం 7 గంటలకు ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. 8కి ఒంగోలులో జరుగు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రి 11.30కి ఒంగోలు లాయరు పేటలోని సాయిబాబా గుడిలో 2025 నూతన సంవత్సర సందర్భంగా నిర్వహించు హారతి కార్యక్రమంలో పాల్గొంటారు. జనవరి 1వ తేదీన ఉదయం 8 గంటలకు రామ్‌నగర్ రెండో లైన్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 9.30కి మాగుంట అభిమానులు నిర్వహించు 2025 నూతన సంవత్సర వేడుకలో పాల్గొంటారు. సాయంత్రం 3 గంటలకు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలియజేశారు.

# ప్రతి అర్జీ పరిష్కరించాలి



**‘మీకోసం’లో జేసి ఆర్.గోపాలకృష్ణ అధికారులకు ఆదేశం**

**అర్జీదారులకు సౌకర్యాలు, ఉచితంగా అర్జీలు రాస్తున్న సిబ్బంది**

**ఆవరణలో సేంద్రియ కూరగాయల విక్రయ కేంద్రం ఏర్పాటుపై హర్షం**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ‘మీకోసం’లో వచ్చిన ప్రతి అర్జీని సీరియస్‌గా పరిగణనలోకి తీసుకొని సకాలంలో సహేతుకంగా పరిష్కరిం చాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పునరుద్ఘాటించారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ‘మీకోసం’లో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 243 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ‘మీకోసం’ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో అర్జీలను పరిష్కరిస్తున్న తీరును ముఖ్య మంత్రి కార్యాలయం నుంచి అధికారులు పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు. మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్మెంట్ ఇచ్చేసి సమస్యను పరిష్కరించినట్లుగా రికార్డులలో చూపితే సహించబోనన్నారు. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం





కావాల్సిందేనని, పరిష్కరించలేని పక్షంలో అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని ఆయన స్పష్టం చేశారు. కేవలం అర్జీల పరిష్కారంలోనే కాదనీ, ‘మీకోసం’ కార్యక్రమానికి హాజరు విషయంలోనూ సమయపాలన పాటించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ బి.చినఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు,

మిగతా 3లో







# డిజేఆర్ ట్రస్ట్ సేవలు విస్తృతం చేయాలి

**ప్రభుత్వ బధిరుల పాఠశాల, బాలసదన్‌లో చిన్నారులకు కుమార్తెలతో కలిసి విద్యా సామగ్రి పంపిణీ**

**దామచర్ల నాగసత్యలత**

ఒంగోలు, మేజర్‌న్యూస్: డిజేఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని, భవిష్యత్తులో విస్తృతం చేయాలని దామచర్ల నాగసత్యలత అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా డి.జె.ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు నగరంలోని ప్రభుత్వ బధిరుల పాఠశాల, బాలసదన్‌లో చిన్నపిల్లలకు అవసరమైన పలకలు, స్వెటర్స్, వాటర్ బాటిల్స్, ఇండోర్ గేమ్స్ ఐటమ్స్ పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి దామచర్ల నాగసత్యలతతో పాటు వారి కుమార్తెలు దామచర్ల అనిషాలక్ష్మీ, దామచర్ల తనూజలక్ష్మీలు పాల్గొని చిన్నారులకు సామగ్రిని అందజేశారు. ట్రస్ట్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఏపి మారిటైం బోర్డు తొలి సమావేశంలో కీలక అంశాలపై చర్చ



టంగుటూరు, మేజర్‌న్యూస్ : టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, మొదటి ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు సమావేశం ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం మంగళగిరిలోని ఐహెచ్‌సి భవనంలో జరిగింది. ప్రభుత్వ సెక్రటరీ, ఐఅండ్ఐ డిపార్ట్‌మెంట్, సిఈవో, ఆంధ్ర ప్రదేశ్ మారిటైమ్ బోర్డు, ఇతర అధికారులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. మూడు గంటల సుదీర్ఘ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ అనుగుణంగా, పోర్టుల అభివృద్ధి, పెట్టుబడుల కోసం కొత్త ప్రాంతాలను అన్వేషించడంపై వివిధ అంశాలపై చర్చలు జరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు బడ్జెట్ అంచనాలపై వివరణాత్మక చర్చ. మారిటైమ్ సెంటర్ వృద్ధికి వివిధ మారిటైమ్ బోర్డులు, అసోసియేషన్లతో పాల్గొనడానికి ఇండియన్ మారిటైం సెంటర్‌లో సభ్యత్వం తీసుకోవడం, వాటర్ ఫ్రంట్ రాయల్టీపై చర్చ, మోటుపల్లిలో సహజ నౌకాశ్రయం ఏర్పాటుకు పెద్దగంజాంలో నౌకా నిర్మాణ పరిశ్రమ అభివృద్ధిపై చర్చించారు.

# కష్టం నుంచి వచ్చిన ఆలోచనే ‘కాసు ఛారిటబుల్ ట్రస్టు’

**కష్టంలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించడమే ఆశయం**

**2011 నుంచి ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు**

**సేవల ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న కాసు వెంకటేశ్వరరెడ్డి**





పొదిలి, మేజర్‌న్యూస్: ఆయన ఇంటి పేరులో మాత్రమే కాసు ఉంది. కానీ ఆయన పుట్టింది మాత్రం కటిక పేదరికం కుటుంబం. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబం కావడంతో ఆరు మంది పిల్లలను పెంచి పోషించడం తల్లిదండ్రులకు భారంగా మారింది. అయితే చిన్నప్పటి నుంచి కాసు వెంకటేశ్వరరెడ్డికి చదువంటే అమితమైన ఇష్టం. ఒక పక్క పేదరికం. మరో పక్క ఎలాగైనా చదువుకోవాలనే పట్టుదల. దీంతో ఆయన చదువు 5వ తరగతి వరకు గ్రామంలోని సర్కారు పాఠశాలలో సాగింది. అనంతరం చదువుకునేందుకు అక్కడ లేకపోవడంతో 16 కి.మీ దూరంలో ఉన్న గొట్లగట్టు జడ్పీ హైస్కూలుకు నిత్యం నడిచి వెళ్ళి 9వ తరగతి వరకు పూర్తి చేశారు. అక్కడ నుండి అప్పు చేసి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ గుంటూరులో పూర్తి చేశారు. హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ వచ్చిన కొద్దిపాటి డబ్బులతో ఎంసిఏ పూర్తి చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి ఒక వైపు అప్పుల బాధ మరో వైపు ఆయనను అమెరికా వైపు అడుగులు వేసేట్టు చేశాయి. ఇక అక్కడ ఉద్యోగం చేస్తూ చదువు కోసం చేసిన అప్పులను తీర్చుకొని, సమాజంలో ఒక మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కష్టాల్లో ఉన్న వారికి తనకు ఉన్న దాంట్లో సాయం అందించాలనే

మిగతా 3లో

## విభిన్న ప్రతిభావంతుల సౌకర్యం అన్ని పరీక్షలు ఒకేచోట: డాక్టర్ విజయమ్మ



బాపట్ల, మేజర్‌న్యూస్: విభిన్న ప్రతి భావంతుల సౌకర్యార్థం గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కు వచ్చేవారికి వైద్య పరీక్షల నిమిత్తం ఎన్టీఆర్ భరోసా ద్వారా అన్ని పరీక్షలు ఒకే చోట చేస్తామని అన్నారు బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ. సోమవారం జిల్లా వైద్య శాఖ అధికారిని కార్యాలయంలో ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వివరా లు ఇలా ఉన్నాయి ఎన్టీఆర్ భరోసా కి వచ్చే దివ్యాంగుల కు గుంటూరు జి జి హెచ్ లో గల సుశ్రుత హాల్ నందు వైద్యులు పరీక్షిస్తారని. గతంలో లాగా వివిధ విభాగాలు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అందర్నీ ఒకే చోట పరీక్షిస్తారని ఇందులో భాగంగా బుధవారము ఆర్తో ,న్యూరో సర్జరీ న్యూరాలజీ శుక్రవారం కిడ్నీ, శనివారము లివర్ మార్పిడి కి సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారని కావున ఈ అవకాశాన్ని బాపట్ల జిల్లాకు సంబంధించిన సంబంధిత రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు.

## వాటర్ ప్లాంట్లను ఆకస్మిక తనిఖీ



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని వాటర్ ప్లాంట్స్‌ను గుంటూరు సీనియర్ వాట ర్ ఎనలిస్ట్ వి.రాజరావు, మునిసిపల్ కమిషనర్ జి.రఘు నాథ రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్లాంట్ల నందు నీటి నమూనాలను సేకరించి ప్లాంట్ యజమాను లకు పలు సూచనలు చేశారు. పరిసరాలు ఎప్పుడు పరి శుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాంట్ నిర్వహ ణకు సంబంధి ంచి అన్ని శాఖల అనుమతి తప్పక పొందా లన్నారు. నమూనా పరీక్షల అనంతరం అవకతవకలు న్నచో చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాటర్ బాటిల్స్ నందు నీరు నింపి అమ్మకూడదన్నారు. వారి వెంట మునిసిపల్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం, తల్లీబిడ్డ క్షేమం



దర్శి, మేజర్‌న్యూస్: మండలంలో ఓ మహిళ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. అగ్నిపురి యస్‌ఇ కాలనీకి చెందిన గుంటూరి. యశోద అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కి సమాచారం అందించారు. వెంటనే వారి నివాసానికి చేరుకున్న ఈఎంటి వెలుగొండయ్య, పైలట్ నరేష్ బాబు, జి.యశోద కివైద్య పరీక్షలు నిర్వహించారు. అయితే ఆమెకు నొప్పులు అధికంగా వస్తున్న నేపద్యంలో వెంటనే కాన్పు చేయాలని వారి కుటుంబసభ్యులకు తెలియజేశారు. కుటుంబసభ్యుల అంగీకారం మేరకు సిబ్బంది 108 వాహనంలో కాన్పు చేశారు. జి.యశోద ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. దీంతో యశోద కుటుంబసభ్యులు 108 సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారిని వైద్య.పరీక్షల నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

## రమణయ్య మృతి టిడిపికి తీరనిలోటు



దర్శి, మేజర్‌న్యూస్: టిడిపి కార్యకర్త ఓర్సు రమణయ్య మృతి టిడిపికి తీరని లోటు అని మున్సిపల్ చైర్మన్ నార పుశెట్టి పిచ్చయ్య అన్నారు. రమణయ్య మృత దేహానికి టిడిపి నాయకులు నివాళలు అర్పించారు. దర్శి మండ లం కొత్తపల్లె పంచాయితి లక్ష్మీనారాయణ పురం గ్రామాని కి చెందిన ఓర్సు రమణయ్య అనే టిడిపి కార్య కర్త యాక్సిడెంట్లుగా చనిపోగా ఆయన మృతదేహానికి పూల మాల వేసి దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చ య్య, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వ ర్లు,జముకులదిన్నె మాజీ సర్పంచ్ మాగం సుబ్బారావు, కొత్తపల్లి మాజీ సర్పంచ్ గొర్రె సుబ్బారెడ్డి, దర్శి మండల ఐటీడీపీ కన్వీనర్ పత్తిపాటి అంజి నివాళులర్పించారు.

# పిజిఆర్ఎస్ నిర్వహించిన బాపట్ల ఎస్పీ



బాపట్ల, మేజర్‌న్యూస్: ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించ బోమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాల యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు వారి సమస్యలను స్వయంగా ఎస్పీకి విన్నవించుకుని, వ్రాతపూర్వకమైన అర్జీలను అందించారు. వారి సమస్యలను విని, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి చట్ట పరి ధిలో విచారించి త్వరితగతన అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. భువివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు వంటి పలు సమస్యలపై 40 మంది తమ అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో త్వరితగతిన విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పి.జి.ఆర్.ఎస్ సెల్ ఎస్.ఐ శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల కళ్ళల్లో ఆనందం కూటమితో సాధ్యం: గోగన



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: ఒకటో తారీకు పెన్షన్ పంపిణీ చేసి దివ్యాంగులను సంతోష పరుస్తున్న కూటమి ప్రభుత్వం అని అన్నారు బాపట్ల జిల్లా దివ్యాంగుల జనసైనికుడు గోగన ఆదిశేషు.బాపట్ల జనసేన పార్టీ దివ్యాంగుల జనసైనికుడు గోగన ఆదిశేషు మాట్లాడుతూ ఎ.న్డీ.ఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నది ఏడు నెలల్లో కూడా కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీరిద్దరూ తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులు. అందరూ కూడా ఒకటో తారీకు నాడు పెన్షన్ పంపిణీ అందు కుంటూ ఉన్నారు.ఒకటో తారీకు నాడు సెలవు అయితే 31 వ తారీకు నాడు పెన్షన్ అందిస్తున్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరు సంతోషంతో ఉన్నారని దివ్యాంగుల అన్నదమ్ములు, అక్క చెల్లెలు, పెద్దలు, అందరి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోటరీ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సి మోడల్ పేపర్ బుక్స్ పంపిణీ



అద్దంకి, మేజర్‌న్యూస్: రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో మైలవరం జిల్లాపరిషత్ స్కూల్ నందు పదవ తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థినీ విద్యా ర్థులకు పరీక్ష మోడల్ పేపర్ బుక్స్ పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. మలాది శ్రీనివాసరావు ఆర్థిక సౌజన్యం తో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధ్యక్షులు చప్పిడి వీరయ్య తెలిపారు.విద్యార్థులు బాగా చదివి జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడాలని ఆయన పేర్కొన్నారు. శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించి పుష్టిగా, ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యదర్శి మురళీ సుధాకరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని, చదివిన పాఠశాలకు, తల్లితండ్రులకు పేరు తేవాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో కూడా రోటరీ సభ్యులు తమ పాఠశాలకు సైకిళ్ళు, పుస్తకాలు అందించారని, ఈ సంవత్సరం కూడా తమ పాఠశాల విద్యార్థులకు మోడల్ పేపర్ బుక్స్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మెన్ భీమని కృష్ణ మూర్తి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమేష్, వెంకటరావు, వెంకట లక్ష్మీ దేవి, పద్మావతి, లావణ్య, పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో గోశాలలు నిర్మాణం



పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: ఏపీలో గోకులం పథకం లో భాగంగా ఉపాధి హామీ నిధులతో పశువులకు గొర్రెలకు షెడ్లును నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఆర్థిక సాయంలో కొంత వాటా కూలీలకు వేతనాల రూపంలో చెల్లింస్తున్నారు. పశువుల షెడ్లు నిర్మాణంలో పాల్గొనే ఉపాధి హామీ కూలీలకు, గొర్రెల షెడ్లు నిర్మాణంలో పాల్గొనే కూలీలకు డబ్బుల్ని వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ పథకంలో భాగంగా పశు షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు పశువుల షెడ్లు నిర్మాణంలో పాల్గొనే కూలీలకు 46 పనిదినాలకు అదనంగా రూ.13,371లు చెల్లించను న్నారు. అలాగే గొర్రెల షెడ్లకు 67 పని దినాలకు రూ.20,205లు వారి అకౌంట్‌ల లో జమ చేయనున్నారు. అయితే ఇప్పటి వరకు పుల్లల చెరువు మండలం మొత్తం 23 షెడ్లు మంజూరు అయ్యా యి. వీటిలో 10 షెడ్లు పూర్తి కాగా 7 షెడ్లు బెస్మెంట్ లెవల్, 6షెడ్లు కప్పు లెవల్‌లో ఉన్నాయి.అయితే వీటికి ప్రభుత్వం నుంచి రెండు పశువులతో షెడ్డు వేసుకుంటే రూ.1.15లక్షలు రైతు వాటా రూ.11,500 చెల్లిస్తే మిగతా డబ్బు ప్రభుత్వం అందిస్తుంది. 4 పశువులకు రూ.1.85 లక్షలు కాగా 90 శాతం రుణం 10 శాతం రైతు వాటా ఉంటుంది. అలాగే 6 పశువులకు రూ.2.30 లక్షలు కాగా రూ.23 వేలు రైతు వాటా ఉంటుంది. మేకలు, గొర్రెలు పెంపకం దారులకు కూడా ఇలాగే రుణం మంజూరు చేస్తారు. గొర్రెలు, మేకల షెడ్లుకు 20 జీవాలు రూ.1.30 లక్షలు, 50 జీవాలకు రూ.2.30 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తారు. అదే వంద కోళ్ల షెడ్లుకు రూ.87 వేలు, 200 కోళ్ల షెడ్లుకు రూ.1.32 లక్షలు అంది స్తారు. ఈ గోకులాలను జనవరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని ఏపిఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

# జనవరి 5న 'జొన్నవిత్తుల'కు సాహిత్య పురస్కారం ప్రధానం



అద్దంకి, మేజర్‌న్యూస్: తెలుగు వేదకవి, సినీ గేయ రచయిత, ప్రముఖ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు కు పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల సాహిత్య పుర స్కారం - 2025 ను జనవరి 5వ తేదీన ప్రదానం చేయను న్నట్లు పుట్టంరాజు ట్రస్టు అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. ఈ సాహిత్య పురస్కార ప్రదాన కార్యక్రమం జనవరి 5 న ఉదయం 10 గంటలకు అద్దంకి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండప ంలో జరుగుతుందని నిర్వాహకులు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. జొన్నవిత్తుల రామలింగేశ్వర రవు 24 శతకాలు, 600కు పైగా సినీగీతాలు, 200కు పైగా పేరడీలు, 3000కు పైగా పద్యాలు రచించారని, తెలుగు భాషా వ్యాప్తి కోసం ప్రపంచవ్యాప్తంగా పర్యటించి ప్రసం గాలు నిర్వహిం చారని పలువురు వ్యాఖ్యానించారు. తెలుగు భాషా చైతన్యం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న ఈ బహుముఖ ప్రజ్ఞావంతునికి పురస్కారం ప్రదానం చేయడం గర్వకారణ మని వక్తలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా డివి ఎమ్ సత్యనా రాయణ రచించిన "వ్యాస మంజూష" పుస్త కాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ఆవి ష్కరించను న్నారని వారణాసి రఘురామశర్మ వెల్ల డించారు. కార్యక్రమ ంలో నారాయణ బాలసుబ్రమణ్యం, డా. యు. దేవపాలన, నిమ్మరాజు నాగేశ్వరరావు, చిన్ని మురళీకృష్ణ, చప్పిడివీర య్య, చుండూరి మురళీసుధాకరరావు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



వేమూరు(భట్టిప్రోలు) మేజర్‌న్యూస్: వేమూరు మండలంలోని చావలి గ్రామా నికి చెందిన ప్రసాదం నాగమల్లేశ్వరి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయిం చుకోగా బాధితురాలు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ 45,350 లను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంజూరు చేయిం చి సోమవారం చెక్కు అందజేశారు. అదే విధంగా భట్టిప్రోలు మండలం రాచూరు గ్రామానికి చెందిన రావూరి పద్మజ వైద్య ఖర్చు నిమిత్తం లక్ష 555 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. బాధితులతో పాటు ఆయా గ్రామానికి చెందిన టిడిపి నేతలు ఉన్నారు.

## ఉచిత పశు వైద్య శిబిరం



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లా శ్రీ సత్య సాయి గ్రామ సేవ విభాగం వారి ఆధ్వర్యంలో రేపల్లె సత్య సాయి సేవా సమితి పరిధిలోని మండ లంలోని ప్రజ్ఞం గ్రామంలో సోమవారం ఉచిత మెగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంకు పాల సేక రణ కేంద్రం నిర్వాహకడు కూనపు రెడ్డి రాంబాబు గ్రామ సర్పంచ్ ఉప్పల బసవ పూర్ణమ్మ ఈ కార్యక్రమంలో విశ్రాంతి పశు వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పున్న య్య శాస్త్రి పాల్గొనని అవసరమైన మం దులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం దూడల అందాల పోటీలు నిర్వహించి పత్తి రైతుకు ఒకటిన్నర లీటర్ కాలుష్యం, స్టీల్ క్యాన్, మినరల్ మిక్సర్, ఒక నిమ్మ మొక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, అసిస్టెంట్ డైరెక్టర్ నాంచారయ్య, రవణమ్మ కూచినపూడి పశు వైద్యాధికారి హేమ ప్రియా, సిబ్బంది పాల్గొన్నారు.

## కోట బ్రహ్మయ్యను సత్కరించిన జ్యువెలరీ అసోసియేషన్



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సొసైటీ ఎన్నికలలో ట్రెజరర్ గా గెలుపొ ందిన కోట బ్రహ్మయ్యను బులియన్ జ్యువెలరీ, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ కార్యాలయంలోసభ్యులు సోమవారము ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల ఎడ్యుకే షనల్ సొసైటీ ప్రతిష్ఠను పెంచేలా తన బాధ్యతగా వ్యవహరిస్తానని అన్నారు. గౌరవ అధ్యక్షులు బొమ్మిశెట్టి హరినాథ మురళి, అధ్యక్షులు వెదురుపర్తి లక్షణమూర్తి, సెక్రెటరీ దొడ్డ రామకృష్ణ, ట్రెజరర్ నాలం నరేష్, జాయింట్ సెక్రెటరీ మొదడుగు నరేష్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.





# ప్రతి అర్జీ పరిష్కరించాలి

**మొదటి పేజీ తరువాయి**

డిప్యూటీ కలెక్టర్ పార్ధసారధి, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సేంద్రీయ కూరగాయలపై ఆసక్తి**

అర్జీలు ఇవ్వడం కోసం కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలకు అవసరమైతే వాటిని ఉచితంగా రాయడంతో పాటు ఆయా విభాగాల అధిపతుల వద్దకు తీసుకువెళ్లడం, తమ వంతు వచ్చే వరకు వారిని ప్రత్యేకంగా కేటా యించిన టెంటులో కూర్చోబెట్టి అవసరమైన మంచినీరు, టీ ఇచ్చి అర్జీలు స్వీకరించేలా ప్రత్యేక ఏర్పాట్లను కలెక్టర్ చేయించడంపై అర్జీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు సేంద్రీయ కూరగాయల వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రతి సోమవారం కలెక్టరేట్లో ప్రత్యేక విక్రయకేంద్రాన్ని ఏర్పాటు చేయించడంపైనా అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ వాటిని కొనుగోలు చేస్తున్నారు.

## కష్టం నుంచి వచ్చిన ఆలోచనే 'కాసు ఛారిటబుల్ ట్రస్టు'



**మొదటి పేజీ తరువాయి** లక్ష్యంతో 'కాసు ఛారిటబుల్ ట్రస్టు' ఏర్పాటు చేసి పదిమందికి ఆపన్నహస్తం అందిస్తున్నారు కాసు వెంకటేశ్వరరెడ్డి. కొనకనమిట్ల మండలం బచ్చలకూరపాడు గ్రామంలో కాసు తిరుపతరెడ్డి, సుబ్బమ్మ దంపతులకు ఐదవ సంతానం కాసు వెంకటేశ్వరరెడ్డి. పేదరికంలో కష్టపడి చదువుకొని ప్రస్థుతం అమెరికాలో అన్ని విధాలుగా స్థిరపడ్డారు. అయినప్పటికీ పుట్టి పెరిగిన గ్రామం, మండలాన్ని మరిచిపోలేదు. కష్టంలో ఉన్న వారికి తన వంతు సాయం అందించాలనే ఉద్దేశ్యంతో 2011లో 'కాసు ఛారిటబుల్ ట్రస్టు' ఏర్పాటు చేసి ఇప్పటివరకు కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. భవిష్యత్తులో తమ ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు అన్ని గ్రామాల్లో వాలంటీర్లను ఏర్పాటు చేసుకున్నారు. వీరి ద్వారా ఆపదలో ఉన్నవారిని ఆదుకొనేందుకు ప్రణాళిక తయారు చేసుకున్నారు. కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో కాసు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందిస్తున్నారు.

## అర్బన్ మార్కెట్‌కు విశేష స్పందన



ఒంగోలు, మేజర్‌న్యూస్ : మహిళా మార్ట్ సమీపంలో డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకాల కోసం ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను పీడీ మెప్మా తేళ్ల రవికుమార్ ప్రారంభించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ మహిళలకు బ్యాంకులు రుణపరపతి కోసం ఎన్నో మెరుగైన పథకాలను అమలుచేస్తున్నాయి. ఇటువంటి తరుణంలో మహిళలు ఆర్ధికాభివృద్ధివైపు, సుస్థిర జీవనోపాధుల, ఉత్పత్తి రంగాలలో రాణించాలని అభిప్రాయపడ్డారు. వారు ప్రదర్శించిన ఉత్పత్తులను చూసి సంతృప్తి వ్యక్తం చేసి, ఇంకా మెరుగైన, ప్రయోజనకరమైన ఉత్పత్తులు మీ నుండి రావాలని కోరారు. ఇందులో డ్వాక్రా ఉత్పత్తులను 1) కథ 2) వస్త్ర 3) ఆభరణ 4) ఆహా అని నాలుగు రకాలుగా వర్గీకరించి నాణ్యమైన ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచడం జరిగిందని సిటీ మిషన్ మేనేజర్ జి.కల్పన, టీ ఈ జయకుమార్, సంతోషకుమార్ తెలిపారు. ప్రతి నెలలో రెండు రోజులు నిర్వహించే మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఒంగోలు నగర ప్రజలు దర్శించాలని, కొనుగోలు చేయాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ తేళ్ల. రవికుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ తేళ్ల రవి కుమార్‌తో పాటు ఎన్. జయకుమార్, డి. సంతోష్ కుమార్, సిటీ మిషన్ మేనేజర్ కల్పన, ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు, డ్వాక్రా ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.



## స్మశానలు అభివృద్ధికి అనుమతులు మంజూరు: చైర్మన్

దర్శి, మేజర్‌న్యూస్: నగర పంచాయతీ పరిధిలోని 9 స్మశానాలు అభివృద్ధి కొరకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యతెలిపారు. దర్శి నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం సోమవారం దర్శి నగర పంచాయతీ హాల్‌లో నారపుచెట్టి పిచ్చయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పిచ్చయ్య మాట్లాడుతూ దర్శి నగర పంచాయతీలో తొమ్మిది స్మశానాలు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని పిచ్చయ్యతెలిపారు. దర్శి నగర పంచాయతీలో ఎక్కడైనా స్మశానాలు ఉన్నట్లయితే కౌన్సిల్ సభ్యులు తమ దృష్టికి తీసుకురావాలని, వాటి అభివృద్ధి కొరకు ప్రతిపాదనలు పంపి అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన సమావేశంలో పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలో గృహాలు, షాపులు నిర్మించుకునేవారు నగర పంచాయతీకాలువలు దాటి రాకుండా ఉండాలని, నగర పంచాయతీ రోడ్లలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అలా రాకపోకలకు ఇబ్బందులుకలిగించిన వారిపై చట్ట పరంగా జరిమానాలు వేయడంజరుగుతుందని ఆయన తెలిపారు. చెత్త, చెదారం రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్ లోనే వేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో దర్శి నగర పంచాయతీ వైస్ చైర్మన్ కోటయ్య, దరిశి పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, టౌన్ ప్లానింగ్అధికారి శ్రీకాంత్, ఏఈ శ్రీనివాసరావు, కౌన్సిలర్ సభ్యులు నగర్ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సింహాల దెబ్బకు ప్రజలు బెంబేలు



మద్దిపాడు, మేజర్‌న్యూస్ : మద్దిపాడులో గ్రామ సింహాలు సోమవారం స్వైర విహారం చేశాయి. మద్దిపాడుపై పాలెంలో కుక్కలు కరవడంతో నలుగురుకు తీవ్ర గాయాలయ్యాయి. మద్దిపాడు గడియపుడి కాలనీలో ఇద్దరను కుక్కలు కరిచాయి. దీంతో ప్రజల బెంబేలు ఎత్తుతున్నారు. ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు, గుంపులుగా ఉండటంతో ప్రజలు భయభ్రాంతులను చెందుతున్నారు.

## బిసి హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



మద్దిపాడు, మేజర్‌న్యూస్: మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మద్దిపాడు బీసీ హాస్టల్ నందు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు డాక్టర్ ఆనంద్ మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగింది. పై కార్యక్రమంలో రాము, హెల్త్ సూపర్వైజర్ బాలకోటయ్య హెల్త్ అసిస్టెంట్ దరియా సురేషు, ఆశా కార్యకర్త గౌసియా పాల్గొన్నారు. 30 మంది విద్యార్థులను పరీక్షించడం జరిగింది. అవసరమైనకి మందులు వెంటనే ఇవ్వడం జరిగింది.

## కరాటే ఛాంపియన్ షిప్‌లో సత్తాచాటిన క్విస్ స్కూల్ విద్యార్థి



ఒంగోలు, మేజర్‌న్యూస్ : కాకినాడలో ఈ నెల 22న జరిగిన ఇన్విటేషనల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో క్విస్ హైస్కూల్ విద్యార్థి సత్తాచాటాడు. క్విస్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న కడియాల జయంత్ బంగారు పతకాన్ని సాధించాడు. కరాటేలోని కుమిటే విభాగంలో మొత్తం 1350 మంది విద్యార్థులు పాల్గొనగా వివిధ రౌండ్లు దాటుకుంటూ ఫైనల్స్‌కి చేరుకున్న జయంత్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం కజయంత్ ని అభినందించింది. విద్యార్థులు కేవలం చదువు పరంగానే కాకుండా క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి తోడ్పడతాయని క్విస్ సంస్థల చైర్మన్ డాక్టర్ సూర్య కళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కమలేశ్వరి, కరాటే మాస్టర్ డి.ఎస్. కుమార్, ఉపాధ్యాయులు జయంత్‌ని అభినందించారు.

## విపత్తులను అధిగమించడమే ఎన్ఐడిఎం లక్ష్యం



కొత్తపట్నం, మేజర్‌న్యూస్: విపత్తులను అధిగమించడమే నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ లక్ష్యమని డాక్టర్ రంజన్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాతీయ విపత్తుల సంభవించినప్పుడు ఏ విధంగా అధిగమించాలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రంజన్ కుమార్ మాట్లాడుతూ తీసుకోవలసిన జాగ్రత్తలు గర్భవతులు బాలింతలు చిన్న పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారితో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. సౌత్ ఇండియాలో తమిళనాడు ఆంధ్రప్రదేశ్ కేరళ ఒరిస్సా గుజరాత్ రాష్ట్రాలలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 3,4,5, తరగతుల విద్యార్థులు, గర్భవతులు, బాలింతలు, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వేరువేరుగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బాలు, డిప్యూటీ కలెక్టర్ మాధురి, మండల విద్యాశాఖ అధికారిని పద్మావతి, హెచ్‌ఎం ఎం. శ్రీదేవి డిప్యూటీ తాసిల్దార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

మద్దిపాడు, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని వివిధ గ్రామాల వీఆర్వోల గ్రామ రెవెన్యూ సంఘం ఎన్నికలను సోమవారం నాడు నిర్వహించారు. ఈ ఎన్నికల నిర్వహణలో భాగంగా మద్దిపాడు మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన మండల కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా షేక్ ఆరిఫా, ఉపాధ్యక్షులుగా సిహెచ్ దీపక్, కార్యదర్శిగా కె. అంకమ్మరావు, కోశాధికారి సి.హెచ్ రమేష్, సహాయ కార్యదర్శులుగా షేక్ మీరావలి, జి సుధాకర్ రావు, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి అయిన ఆదిరెడ్డి నియామకపత్రాలను జిల్లా సంఘం తరపున అందజేయడం జరిగింది.



# భూకబ్జా దారులను కఠినంగా అణచివేస్తాం



మార్కాపురం రూరల్, మేజర్‌న్యూస్: మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి నియోజకవర్గంలోని నికరంపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో వైసీపీ నాయకులు పలు గ్రామాలలో పట్టణంలో విచ్చలవిడిగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. ఈ భూ కబ్జాదారులను అణిచివేయడానికి తెలుగుదేశం ప్రభుత్వం దేశం మొత్తం మీద కఠినమైన ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకు వచ్చిందని ఈ చట్టంతో భూ కబ్జాదారులను కఠినంగా అణిచివేస్తామని అన్నారు. చివరకు వైసీపీ నాయకులు మార్కాపురం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి భూములు కూడా ఆక్రమించారని వాటిని కూడా త్వరలోనే స్వాధీనం చేసుకొని టెంపుల్ కు అప్పగిస్తామని అన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీల లో కొన్ని అదే రోజు పరిష్కారం చూపిస్తామని, మిగతా అర్జీలకు 45 రోజులలో పరిష్కారం అవుతాయని అన్నారు. అబద్దాలు ఆడడం, స్కాములు ద్వారా ప్రజల ను దోచుకోవడం వైసిపి నాయకుల వంతని, అభివృద్ధి సంక్షేమమే ఎజెండాగా తెలుగుదేశం ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఇప్పటికైనా ప్రజలు ఏది మంచి పాలనో గుర్తు ఎరగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతులు పొలాల్లో తమ సమస్యలపై తహసిల్దార్‌కు అర్జీలు అందజేశారు. రెవెన్యూ సదస్సులో తహసిల్దార్ చిరంజీవి, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న తిరివీధి జనార్ధన్



పామూరు, మేజర్‌న్యూస్: రూ.లక్షతో ఆన్ లైన్ ప్రక్రియ ద్వారా తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వానికి పామూరు మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త తిరివీది జనార్ధన్ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం మేరకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో ఆన్లైన్ ప్రక్రియ ద్వారా కనిగిరిలోని టిడిపి కార్యాలయంలో సోమవారం శాశ్వత సభ్యత్వాన్ని తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఈ రాష్ట్రానికి రాష్ట్ర ప్రజలకు ఎప్పటికీ అవసరం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం పురోగమిస్తుందని నియోజకవర్గ ప్రజలందరూ టిడిపికి మద్దతు ఇచ్చి తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు తీసుకోవాలన్నారు.

# బొకేలు, శాలువాలు సంస్కృతిని విడనాడుదాం



దర్శి, మేజర్‌న్యూస్: పూల దండాలు, బొకేలు, శాలువాల సంస్కృతి విడనాడాలని దర్శి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. దర్శి నియోజకవర్గ నా అభిమాన ప్రజానీకానికి తెలుగుదేశం-జనసేన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, కుటుంబ సభ్యులకు ప్రత్యేక విన్నపం. నూతన సంవత్సరాన్ని స్వాగతిద్దాం. నూతన సంవత్సర వేడుకల్లో అందరం ఒకటవుదాం బొకేలు శాలువాల సంస్కృతిని వీడండి పేద విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలతో కలిసి శుభాకాంక్షలు తెలుపుదామని డాక్టర్ లక్ష్మి కోరారు. దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దర్శి పట్టణం,లంకోజనా పల్లి రోడ్‌లోని నివాసం వద్ద ఈనెల 1వ తేది బుధవారం నూతన సంవత్సర వేడుకలకు హాజరవుతారన్నారు.

**నేడు పసుపుగల్లులో గొట్టిపాటి లక్ష్మి పర్యటన**

నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఈ నెల 31న మంగళవారం ఉదయం 8.30కి ముండ్లమూరు మండలం, పసుపుగల్లులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. నియోజక వర్గంలోని మండల పార్టీ అధ్యక్షులకు, వివిధ హోదా ల్లో ఉన్న టిడిపి నాయకులకు, మహిళలకు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

# కుష్టు వ్యాధి ఇంటింటా సర్వే వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్: 2025 జనవరి 20 నుండి ఫిబ్రవరి 2 వరకు జరగనున్న జాతీయ కుష్టు నిర్మూలన కుష్టు వ్యాధి ఇంటింటా సర్వే కార్యక్రమం పై కుష్టు వ్యాధి లక్షణాలు తెలుపుతూ ప్రజలకు అవగాహన కొరకు కరపత్రిక గోడ పత్రికలను ఆవిష్కరించారు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నందు పిజిఆర్ఎస్ సమావేశం హాల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, డిఆర్ఓ గంగాధర్ గౌడ్, ఆర్డిఓ గ్లోరియా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మొహమ్మద్ సాదిక్, బాపట్ల శ్రీ పొట్టి శ్రీరాములు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కొప్పుల సిద్ధార్థ్, జిల్లా న్యూక్లియస్ టీమ్ హెచ్ ఇ ఓ బి. కృష్ణ రెడ్డి, డిపిఎంఓ పివి సుబ్రహ్మణ్యం ఉన్నారు. అనంతరం పిజిఆర్ఎస్ లో పాల్గొన్న జిల్లా అధికారుల అందరికీ కరపత్రికలు అందించారు.

# చెరువు అలుగు ఆక్రమిస్తే కఠిన చర్యలు



కనిగిరి, మేజర్‌న్యూస్: కనిగిరి పెద్ద చెరువు నుంచి కొత్తూరు వద్దకు గల అలుగు వాగును రెవెన్యూ, మునిసిపల్, ఇరిగేషన్ అధికారులతో కలసి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సోమవారం పరిశీలించారు. అలుగు ఆక్రమణ దృష్ట్యా అధికారులతో రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. గత నెలలో భారీ వర్షం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురైన దృష్ట్యా మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులును ఆదేశించారు. అలుగు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా అవసరమైతే కేసులు పెట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అలుగు వాగు సర్వే చేసి రికార్డ్ మేరకు సరి చేయాలన్నారు. అప్పటి వరకు నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని అధికారులకు సూచించారు. అనంతరం నిర్మాణం జరుగుతున్న హైవే పనులను కూడా పర్యవేక్షించారు. అక్కడ జరుగుతున్న పనితీరును హైవే ఇంజనీర్‌తో మాట్లాడారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట పట్టణ టీడీపీ అధ్యక్షులు తమ్మనేని శ్రీనివాసులు రెడ్డి, మునిసిపల్ కమీషనర్ డేనియల్ జోసెఫ్, తహసీల్దార్ అశోక్ కుమార్, ఇరిగేషన్ రామకృష్ణ, సర్వేయర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేద్దాం



కొమరోలు, మేజర్‌న్యూస్: ప్రజా సమస్యల పరిష్కారానికి అందరం చిత్తశుద్ధితో కలిసి కృషి చేద్దామని స్థానిక ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్థానిక మండల అధ్యక్షురాలు కామురి అమూల్య అధ్యక్షత వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికై ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గతంలో కూడా చాలా రకాలుగా కృషి చేశాడని, అయితే ప్రస్తుతం మండల లో ఉన్న ప్రధానమైన సమస్యలైనా ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించడం, మహిళలకు డిగ్రీ కళాశాల ఏర్పాటు, కొమరోలు టౌన్‌లో డ్రైనేజ్, ఆయా సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడం జరిగింది. అనంతరం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధి పట్ల కృత నిశ్చయం కలిగి ఉన్నామని, అందుకే గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా ఎక్కడ సిసి రోడ్ల కొరత లేకుండా వేపించగలిగామని, ప్రస్తుతం కూడా ముందుగా ఎక్కడైతే మిగిలిపోయి ఉన్నా రోడ్లు ఉన్నాయో వాటిని గుర్తించి వెంటనే వాటిని పనులు చేపట్టడం దాదాపు పూర్తి చేయడం కూడా జరిగిందని, రానున్న నిధుల్లో ఇంకా ఎక్కడ కూడా కొరత లేకుండా అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, అనంతరం రాబోయే సంవత్సరం నిధుల్లో కాలువల నిర్మాణం కూడా చేపట్టి మండల అభివృద్ధికి పూర్తిస్థాయిలో అన్ని రకాల విద్యా, వైద్యం, మౌలిక వసతులు కల్పనకై కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ మస్తాన్వలి, తాసిల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచులు, డాక్టర్స్ చైతన్య దీపక్ హసీనా, వినోద్ కుమార్, ఏఈలు శ్రీనివాసులు, శ్రీనివాసరావు, వీరయ్య, కృష్ణారెడ్డి, సుధాకర్, వ్యవసాయ అధికారి రాజశ్రీ, హార్టికల్చర్ అధికారులు మోహన కృష్ణ, విష్ణు ప్రియ, ఏపీవో మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ల్యాండ్ గ్రాబింగ్ చేసిన వారిపై చర్యలు



తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండలంలో భూ బకాసురుల లిస్ట్ తయారు చేయమని తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చిన ఎమ్మెల్యే తర్లుపాడు మండలంలో భూ ఆక్రమ దారులు ఎక్కువ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులలో భాగంగా తర్లుపాడు మండలం సీతానాగుల వరం గ్రామంలో సోమవారం గ్రామ సచివాలయం వద్ద తహసీల్దార్ యూ.విజయ భాస్కర్ అధ్యక్షతన రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ రెవిన్యూ సదస్సుకు ముఖ్య అతిథులుగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి పాల్గొని ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ తర్లుపాడు మండలంలో భూ ఆక్రమ దారులు ఎక్కువగా ఉన్నారని ఎంత మంది ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ పరిధికి వస్తారో వారి చిట్టా అంతా తీసి అటువంటి వారి లిస్ట్ రెవిన్యూ సదస్సులు ఐపోయాక భూ కబ్జా దారులపై ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ అమలు చేయాలని తహసీల్దార్ యూ.విజయ భాస్కర్‌కు ఆదేశాలు జారిచేశారు. ఇలాంటి వారి కోసం బాధితుల పక్షాన నిలబడేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు, ఇలాంటి భూ కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, విఆర్ఓ ఆదినారాయణ, పంచాయితీ కార్యదర్శి గీత, సచివాలయ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, పుచ్చనూతల గోపినాథ్ చౌదరి, మేకల వెంకట్, నంబూల లక్ష్మయ్య, కుందురు కాశిరెడ్డి, బోగినేని చిరంజీవి, శ్యాం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీలపై నిర్లక్ష్యం వీడండి: కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలు పరిష్కార వేదికలు వచ్చిన అర్జీలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు 2107 మంది హౌస్ హోల్డ్ సర్వేలో విడిగా నమోదయ్యారని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, డాక్టర్ విజయమ్మ, డి.ఆర్. డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మజ పాల్గొన్నారు.

# కౌశల్ 2024లో సత్తా చాటిన బాపట్ల జిల్లా విద్యార్థులు



బాపట్ల, మేజర్‌న్యూస్: కౌశల్ 2024 క్విజ్ పోటీల్లో బాపట్ల జిల్లా విద్యార్థి బృందం రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించింది. సోమవారం విజయవాడలో స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నందు ఏపీ సైన్స్ సిటీ, భారతీయ విజ్ఞాన మండలి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కౌశల్ రాష్ట్ర స్థాయికి క్విజ్ పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులతో కూడిన బృందం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి 15 వేల రూపాయల నగదు బహుమతిని గెలుచుకున్నారు. పిట్టలవాని పాలెం మండలం చందోలు జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన బీ బీ బషీర్, భట్టిప్రోలు మండలం పెసర్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన మోర్ల తేజశ్రీ, బల్లికురవ మండలం కొప్పెరపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి బత్తుల అభిరామ్ లు ఈ ఘనత సాధించారు. అలాగే పోస్టర్ విభాగంలో ఇంకొల్లు మండలం పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తాటిపర్తి చంద్రహాసిని రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. విజయవాడలో జరిగిన బహుమతి ప్రదానోత్సవం లో విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు, భారతీయ విజ్ఞానమండలి జాతీయ కార్యదర్శి కే సుబ్బరాయ శర్మ, సిరికొండ రమేష్ తదితరుల సమక్షంలో నగదు పురస్కారము మెమెంటో, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లాకు మంచి పేరు తెచ్చిన విద్యార్థిని విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, కౌశల్ కోఆర్డినేటర్లు పీ పూర్ణచంద్రరావు పి భానుచంద్రమూర్తి తదితరులు అభినందించారు.

## ఎస్సీ సెల్ అధ్యక్షునిగా వాసు

చీరాల, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వాసుమల్ల వాసును పార్టీ అధిష్టానం నియమించిన సందర్భంగా సోమవారం బాపట్ల జిల్లా పరిధిలోని రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఈపూరి గణేష్‌ని, వేమూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబుని మర్యాదపూర్వకముగా కలిశారు. కూటమి ప్రభుత్వం దళితులకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చినటువంటి పథకాలను నిలిపివేయడం గురించి, తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బాపట్ల జిల్లాలో దళితుల పట్ల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గోసాల అశోక్, మొగిలి శబరినాధ్ పాల్గొన్నారు.

## లోక కళ్యాణార్థం గాయత్రి యజ్ఞం

గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన కాశిరెడ్డి నాయన కుంట గాయత్రీ మాత గుడి ఆవరణములో అమావాస్య సందర్భంగా గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూనూరు హనుమంత్ రెడ్డి పాల్గొని యజ్ఞం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్యకి, పున్నానికి యజ్ఞం నిర్వహిస్తారన్నారు. భక్తి జ్ఞానము సత్కర్మలతో చేసే కార్యక్రమము అంకితభావంతో సేవాభావంతో పనిచేసి శాంతి సౌభాగ్యాలను పొందవలెనని కోరారు. పాల్గొనే భక్తులలో సద్బుద్ధి నెలకొల్పుకోవాలన్నారు. మంచి మానవులుగా సత్కర్మలు చేయాలన్నారు. గాయత్రీ మంత్రం నిరంతరం ఉచ్చరించినట్లయితే మంచి, శక్తి కలుగుతుందన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు, వంగల ప్రసన్న, బచ్చు వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి లింగారెడ్డి, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి పోలయ్య, మాజీ సర్పంచ్ రవణమ్మ పాల్గొన్న భక్తులకు బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి కృష్ణ మోహన్ భోజన సౌకర్యం కల్పించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని పి.తక్కెళ్ళపాడు సమీపంలో సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తున్న రాయిని.శ్రీలత (37) అనే వివాహిత మృతి చెందింది. ఈ ప్రమాదంలో శ్రీలత భర్త వేణుకు గాయాలు కాగా అతనిని ఒంగోలులోని ఒక హాస్పిటల్‌లో చేర్చగా చికిత్స పొందుతున్నారు. వేములపాడు గ్రామానికి చెందిన రాయిని వేణు, శ్రీలత తమ మోటార్ సైకిల్‌పై ఒంగోలు నుండి తమ స్వగ్రామమైన వేములపాడు వెళ్తున్నారు. వీరు తక్కెళ్ళపాడు గ్రామం దాటిన తర్వాత రోడ్డు మార్జెన్ దెబ్బ తినటంతో మోటార్ సైకిల్ స్లిప్పయి రహదారిపై పడిపోయారు. అదే సమయంలో మద్దులూరు వైపు నుండి సంతనూతలపాడు వైపునకు వస్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్ వీరిని ఢీ కొట్టినది. తదుపరి వీరిని ఒంగోలు హాస్పిటల్‌లో చేర్పించగా అప్పటికే శ్రీలత మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీలత భర్త వేణు గాయాలతో హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. శ్రీలత మృత దేహాన్ని సంతనూతలపాడు పోలీసులు ఒంగోలు రిమ్స్ కు తరలించారు. వేణు ఫిర్యాదు మేరకు స్తానిక సబ్ ఇన్స్పెక్టర్ వి.అజయ్ బాబు, ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేశారు. గుర్తుతెలియని వాహనంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఎస్సీ కుల సర్వేలో తప్పులు తడకలు: సర్పంచ్

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండలంలో ఎస్సీ కాస్ట్ సర్వేలో తప్పుల తడకగా ఉందని వెలిగండ్ల సర్పంచ్



తాతపూడి సురేష్ బాబు ఆరోపించారు. సోమవారం స్థానిక తాసిల్దార్ సువర్ణకు ఈమేర వినతిపత్రం అందించారు ఎస్సీ కాస్ట్ సర్వేలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్సీ మాదిగలము క్రిస్టియన్‌గా నమోదు చేశారని ఆయన అన్నారు. దానిని సరిచేసి మాదిగలకు న్యాయం చేయాలని ఆయన తాసిల్దారుకు విజ్ఞాన పత్రం అందించారు.

# వ్యాపార రంగంలో మహిళలు రాణించాలి

### మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య



చీమకుర్తి, మేజర్‌న్యూస్: స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన మెప్మా బజార్‌ను మున్సిపల్ కమిషనర్ వై రామకృష్ణయ్య ప్రారంభించిన అనంతరం మెప్మా సిబ్బందితో కలిసి పర్యవేక్షణ అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు వారి జీవన ప్రమాణాలు పెంపొందించుట కొరకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు అందించి, వ్యాపార రంగంలో రాణించేందుకు చర్యలు తీసుకుందన్నారు. బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు సక్రమంగా వినియోగించుకుని వారు స్వశక్తితో ముందుకు సాగాలన్నారు. రుణాలు తీసుకున్న మహిళలు వారిచే సొంతంగా తయారు చేసిన ఉత్పత్తులతో పాటు ఇల్ల వద్ద అమ్మకాలు చేసే వస్తువులను ప్రతి నెల మెప్మా బజార్‌లు ఏర్పాటుచేసి వారి వస్తువులు తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులను అందిస్తారన్నారు. బయట మార్కెట్ రేటుకంటే తక్కువ ధరకే లభిస్తాయన్నారు. ఈ మెప్మా బజార్‌లో ముఖ్యంగా 1.వస్త్ర, 2. కథ, 3.అభరన్, 4. అహా వంటి కేటగిరీ ఉత్పత్తులు లభిస్తాయన్నారు. అనంతరం మహిళల ఉత్పత్తులు పరిశీలించి కొనుగోలు చేసారు, మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య మెప్మాబజార్‌ను సందర్శించి వారి ఉత్పత్తుల అమ్మకాల గురించి తెలుసుకొన్నారు. మహిళలు స్వశక్తితో ముందుకు ఎదిగేందుకు మున్సిపల్ పరిధిలో వారికి పర్మినెంట్‌గా వ్యాపార కూడలి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ బీవీ. ఫణి కుమారి,చిరంజీవి ఆలూరి, సిఓ రాజేశ్వరి, డిఆర్‌పి జగదీష్,ఆర్పీలు పాల్గొన్నారు.

# సదర్‌లాండ్ గ్లోబల్ సర్వీసెస్‌కు సెయింట్ ఆన్స్ విద్యార్థుల ఎంపిక



వేటపాలెం, మేజర్‌న్యూస్: పట్టణంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి నుండి సోమవారం ప్రముఖ సదర్ ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్‌కు 103 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరి వనమా రామ కృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపాల్ డా.కె.జగదీష్ బాబు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నూతలపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. డా.సి. సుబ్బారావు,డైరక్టర్(అక్రిడిటేషన్స్) ఆర్.వి.రమణ మూర్తి, మేనేజర్, (ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్) సి.ఎస్.ఇ విభాగాధిపతి డాపి.హరిణి, ఇ.సి.ఇ విభాగాధిపతి డా.డి.రాజేంద్ర ప్రసాద్, ఇ.ఇ.ఇ విభాగాధిపతి డా. కె.అనిల్‌కుమార్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి టి.కిరణ్ కుమార్, ఎ.ఐ.యం.ఎల్ విభాగాధిపతి డా.సి.హరి కిషన్, ఐ.ఒ.టి విభాగాధిపతి డా.ఎస్. ఇంద్రనీల్, సైబర్ సెక్యూరిటి విభాగాధిపతి డా.యం.రమేష్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

# తప్పుల తడకగా కులాల జాబితా: సుజన్‌మాదిగ



ఒంగోలు, మేజర్‌న్యూస్:రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కులాల జాబితాలు గ్రామ సచివాలయాల్లో పొందు పరచడం జరిగిందని, ఆ జాబితాలో కులాల పేర్లు తప్పులు తడకగా ఉండటం వల్ల, ప్రకాశం జిల్లాలో సుమారు 10,000మంది మాదిగ, అనుబంధ కులాలకు నష్టం జరిగే ప్రమాదం పొంచి ఉందని రాష్ట్ర మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ తెలియజేశారు. సోమవారం ఆయన ఒంగోలులోని స్థానిక ఎంఎస్‌పిఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ, ఎస్సీ కులాల జాబితా గ్రామసచివాలయాల్లో పొందు పరచడం జరిగిందని, స్థానిక వీఆర్వోగాని, గ్రామ పంచాయతీ సెక్రటరీగానీ దండోరా వేసి, గ్రామ ప్రజలకు నేటికీ తెలియజేయలేదన్నారు ఇలాంటి చాలా తప్పులుతడకగా జాబితాలు ఉండటం వలన, వాటిని సరిచేసుకునేం దుకు గ్రామస్థాయి సచివాలయాల్లో, విఆర్ఓ సచివా లయ కార్యదర్శుల ద్వారా ప్రజలకు దండోరా వేసి, పూర్తిస్థాయి సమాచారం తెలియపరచాలని కోరారు. లేదంటే భవిష్యత్ తరాలు చాలా నష్టపోయే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం ద్వారా తెలియజేస్తున్నామని, జాబితాలు సవరణలకు మరో 10రోజులు అవకాశం ఇవ్వకుంటే మాదిగ మాదిగ అనుబంధ కులాలకు తీవ్ర నష్టం వాటిల్లె ప్రమాదం ఉందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# బీసీ వసతి గృహాన్ని ఎంపీడీవో తనిఖీ



పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాన్ని సోమవారం పుల్లలచెరువు మండల అధికారి వసంతరావు నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్‌ను పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. తదనంతరం పాఠశాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల విషయమై ఆరాతీశారు. బీసీ హాస్టలల్లో మెరుగైన మౌలిక వసతులతో కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆయన కోరారు. హాస్టల్లో సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తున్నార లేదని రికార్డ్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ఆహారం అందించే విధానం, మెనూ ప్రకారం పిల్లలకు అందిస్తున్నారా లేదా అని కూడా పరిశీలించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత బాగోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం హాస్టల్ గదులను పరిశీలించారు. విద్యార్డులకు స్టడిలో కానీ, భోజన మెనూలో కానీ పొరపాట్లు చేస్తే కఠనంగా వ్యవహరిస్తామన్నారు. పౌష్టికాహారంతో కూడిన భోజ నాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండలరిసోర్స్ కోఆర్డినేటర్ శామ్యూల్, పుల్లలచెరువు టిడిపి మండల కన్వీనర్ పయ్యాల ప్రసాద్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూఇయర్ సెలబ్రేషన్స్ పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు: ఎస్ఐ

టంగుటూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలో న్యూ ఇయర్ సెలబ్రేషన్ పేరుతో పోలీసులు నిబంధనలు అతిక్రమించి మద్యం సేవించి వాహనాలు నడిపిన, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపిన, త్రిబుల్ డ్రైవింగ్ చేసిన, అర్ధరాత్రి న్యూ ఇయర్ పేరుతో పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం సేవించి సౌండ్ బాక్స్‌లతో ప్రజలకు ఇబ్బందులకు గురి చేసిన క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని టంగుటూరు మండల ప్రజలను టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. పోలీసులు నిబంధన ప్రకారమే సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ చేసుకోవాలని మండల ప్రజలకు పోలీస్ శాఖ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సిపిఎం వినతి

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన సి.ఎస్.పురంలోని పాములవారి కాలనీలో వీధిలైట్లు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపియం మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి పంచాయతీ కార్యదర్శికి బ్రహ్మానందరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిని ఊసా రాజ్యలక్ష్మి, స్థానికులు కలిసి గత రెండు నెలలుగా విద్యుత్ దీపాలు లేక చీకటిలో ఉంటున్నట్లు చలికాలం,వర్షాల వలన విషపురుగులు తిరుగుతున్నట్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నట్లు కాలనీ వాసులు పలు పర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు తెలిపారు. పంచాయతీ వారు వెంటనే తగుచర్యలు తీసుకుని పాములవారి కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఊసా రాజ్యలక్ష్మి కోరారు.

## ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



చీమకుర్తి, మేజర్‌న్యూస్: ఏపిటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండరు 2025, చీమకుర్తి మండల విద్యాశాఖ అధికారి అయిన డివిఎల్ నరసింహారావుచే చీమకుర్తి మండల ఎంఆర్‌సి వద్ద ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జె.యాకోబు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సిరిగిరి శ్రీనివాస రావు, ఆంజనేయులు, ఆది శేషు, రాజేష్, హనుమంతురావు, ప్రసాద్, హరి బాబు పాల్గొని ఈ కార్యక్రమంను విజయవంతం చేసారు.

## వరి పంటను పరిశీలించిన అధికారులు



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కే పిట్టకొండ గ్రామంలో రైతులు సాగుచేసిన కొత్తరకం తెలంగాణ మసూర 1638 వరి పొలాలు మండల వ్యవసాయశాఖ అధికారి డి.యుగంధర్ రెడ్డి సోమవారం వరి పైరును నాటిన నెలకే వెన్నులు రావడం గమనించినట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రైతులకు పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందని మండలవ్యవసాయశాఖ అధికారి డి.యుగంధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారి శ్రీలేఖ, వ్యవసాయ సహాయకులు రామస్వామి, రైతులు పాల్గొన్నారు.

## మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



మార్కాపురం రూరల్, మేజర్‌న్యూస్: పట్టణంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ఆయన స్వగృహము నందు ఆవిష్కరించినారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్, క్లస్టర్ ఇన్చార్జి కందుల రామిరెడ్డి, జనసేన జిల్లా నాయకులు సయ్యద్ సాదిక్, పట్టణ టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షుడు మొగల్ షాకీర్ హుస్సేన్ బేగ్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు మొగల్ జాబీర్ హుస్సేన్ బేగ్, గౌరవ అధ్యక్షులు షేక్ తాజ్ హుస్సేన్, షేక్ ఖాసిం భాష, ఉపాధ్యక్షులు షేక్ నాసర్, జాయింట్ సెక్రెటరీ షేక్ జిలాని, నాయబ్, కరిముల్లా, తౌఫిఖ్, జాకీర్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

## అయిదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



వేటపాలెం, మేజర్‌న్యూస్: పట్టణంలో అక్రమ ఇసుక తవ్వకాలు అడ్డగోలుగా జరుగుతూనే ఉన్నాయి. వీటిని అడ్డుకునే ప్రయత్నంలో ఎస్సై వెంకటేశ్వర్లు పోలీస్ పికేట్ని నిర్వహించడంతో దిగపర్రు జాతీయ రహదారిపై వేటపాలెం క్రాస్ రోడ్ వద్ద సోమవారం ఉదయం వెళ్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకోవడం జరిగింది. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పని ఇసుక అక్రమ దారులను హెచ్చరిస్తూ, ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించడం జరిగింది.

## హైందవ శంఖారావానికి బీజేపీ నాయకులు పిలుపు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని కొప్పువారిబజార్ లో జనవరి నెల 5 తేదీన జరిగే హైందవ శంఖారావంకు పెద్ద ఎత్తున రావాలని విజయ వంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనే యులు, గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అపి సెట్టి ఉదయ్ శంకర్, జిల్లా ఏసిసి ప్రధాన కార్యదర్శి మట్టేమల్ల పుల్లయ్య, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ షఫీ, హిందూ నాయకులు సూరే రామ చంద్రుడు, పట్టణ ఉపాధ్య క్షులు కొప్పరపు నాగేశ్వర రావు, సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, సీనియర్ నాయకులు బాదం జయ ప్రకాష్, యువ మోర్చ ఉపాధ్యక్షులు సంతోష్, నాగేశ్వర రావు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక తవ్వకాలు తరలింపుపై చర్యలు తప్పవు: కలెక్టర్



బాపట్ల మేజర్‌న్యూస్: ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపులు బాపట్ల జిల్లా లో జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షిం చేది లేదని ఆర్డిఓ లను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా, తరలింపు లపై ఆర్డీవో లతో సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో ఆయన సమావేశం నిర్వహి ంచారు. ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపులు అరికట్ట డానికి టాస్క్ ఫోర్స్ కమిటీలు సమర్థంగా పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ చెప్పారు. ప్రతి మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీలు చురుగ్గా ఉండాలన్నారు. పట్టా భూములు, అసైన్డ్ భూములు, రైల్వే భూములు, చెరువు పోరంబోకు భూములలో ఇసుక తవ్వకాలకు బాపట్లలో ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అక్రమ లేఅవుట్ లు వేసినా సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్ డి ఓ లు పి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి పాల్గొన్నారు.

# రైతు, ప్రజాసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు




సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో రైతుల,ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల తహశీల్దార్ డి.మంజు నాథరెడ్డి, టిడిపి క్లస్టర్ ఇంచార్జి యన్.సి.మాలకొండయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల భాగంగా సోమవారం మండలంలోని వి.బైలు, మల్లమీదపల్లె గ్రామాల రెవెన్యూ సదస్సు వి.బైలు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ పరమైన సమస్యలు పరి ష్కరించాలని లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహి స్తున్న ట్లు గ్రామంలోని రైతులు తమ భూములకు సంభం దించి సమస్యలను తగిన ఆధారాలతో తమ దృష్టికి తీసుకు రావా లని పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకుంటా మని ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగిం చుకో వాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు నుండి ఫిర్యా దులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.మం జునాధరెడ్డి, మండల టిడిపి క్లస్టర్ ఇంచార్జి యన్.సి. మాల కొండయ్య, సర్పంచ్ దుద్దెల వెంగళరావు, మాజీ సర్పంచ్ సారె వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకులు జమకాల బ్రదర్స్, రెవెన్యూ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

# పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌డిపివో నాగరాజు తనిఖీ




పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌ను మార్కాపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారి యు.నాగరాజు తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది కవాతు నైపుణ్యాన్ని పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో మొక్కను నాటారు. తరువాత స్టేషన్‌లోని క్రైమ్ రికార్డ్స్‌ను పరిశీలించి, కేసుల నమోదు వాటి స్థితి గతులను తెలుసుకుని పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ బాధిత వ్యక్తుల నుంచి ఫిర్యాదును స్వీకరించిన అనంతరం, వారికి వెంటనే రసీదు అందించాలని, ఎఫ్ఐఆర్ నమోదు, కేసుల దర్యాప్తు నిష్పక్షపాతంగా నమోదు చేయాలని రిసెప్షన్ డ్యూటీస్‌లో ఫిర్యాదు దారుని పట్ల మర్యాదగా ప్రవర్తించలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వస్తే న్యాయం చేకూరుతుంది అనే, నమ్మకం కలిగే విధంగా నిష్పక్షపాతంగా పని చేయాలనీ, నేర పరిశోధనలో దర్యాప్తు అధికారి సాక్షధారాలను సేకరించడంలో నైపుణ్యం గా వ్యవహరించాలని, గ్రామ పోలీసు అధికారి గ్రామంలో గల ప్రజల సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు స్టేషన్ హౌస్ అధికారికి తెలియచేయాలని, విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వ్యాయామ ఉపాధ్యాయునికి ఘన సత్కారం



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: శరీరానికి తగినంత వ్యాయా మం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకునే వారికి ఏ వయసులో నైనా అవార్డులు దక్కుతాయనటానికి నిదర్శనంగా తుమ్మ శ్రీనివాస్ రెడ్డి నిలిచారని భట్టిప్రోలు మండల పరిషత్ అధ్యక్షురాలు దావూరి వెంకట లలితమల్లేశ్వరరావు తెలిపారు.వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు తుమ్మ శ్రీనివాస్ రెడ్డి ని సోమవారం ఆమె తమ కార్యాల యంలో సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారు 60 సంవత్సరాల వయసులో కూడా అథ్లెటిక్స్ లో అందులోనూ లాంగ్ జంప్ వంటి క్రీడలలో ప్రతిభను చాటి గోల్డ్ మెడల్ సాధించటం సాధారణ విషయం కాదన్నారు. అటువంటి క్రీడా స్ఫూర్తి కలిగిన ఉపాధ్యాయులు లభించిన ఐలవరం విద్యార్థులు ఎంతో అదృష్టవంతులని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఎంపీడీవో ఎస్ వెంకటరమణ, మండల విద్యాశాఖ అధి కారి నీలం దేవరాజ్,ఏ పి ఎం గుడిమెట్ల శ్రీమన్నారా యణ, ఆఫీస్ సూపరింటెండెంట్ జలజ మరియు సిబ్బంది పాల్గొని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో శ్రీనివాసరెడ్డిని సత్కరించారు.

# తప్పుల తడకగా గత ప్రభుత్వ ఎస్సీ కులగణన సర్వే రిపోర్ట్



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన షెడ్యూల్ కులాల కులగణన సర్వే లిస్ట్ మొత్తం తప్పుల తడకగా ఉంది అని కనిగిరి నియోజకవర్గం ఎంఆర్పిఎస్ కో ఇన్చార్జ్ జేపీ రాజు మాదిగ వెలిగండ్ల ఎమ్మార్పీఎస్ కోఇన్చార్జి పల్లె పోగు యోహాన్ మాదిగ అన్నారు. ఎస్సి కుల గణన లిస్ట్‌ను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు అనుసరించి చేపట్టదలచిన లిఎస్సి వర్గీకరణలి అమలుకి ఈ కుల గణన రిపోర్ట్‌నే కీలకం, సరైన రీతిలో కుల గణన జరగకపోవడం వల్ల ఎస్సీ లో ఉన్న 59 కులాలకు వారి వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కొల్పేయే ప్రమాదం ఉందని, ఇప్పుడు సచివాలయాల్లో ప్రదర్శించిన కుల గణన రిపోర్టులో ఎస్సీ మాదిగ తల్లికి ఉంటే కొడుకుకి ఆది ఆంధ్ర అని ఉందని, మాదిగ అని భార్యకి ఉంటే భర్త కి వేరే కులం ఉందని, తండ్రి హిందూ మాదిగ అని ఉంటే కొడుకు క్రిస్టియన్ అని ఉందని ఇలాంటి తప్పుడు సమాచారం రాష్ట్రవ్యాప్తంగా ఉండే సచివాలయాలలో ఇంకెన్ని తప్పులు ఉంటాయో అని ఆందోళన వ్యక్తం చేసారు. కూటమి ప్రభుత్వం ఈనెల 31 వరకు విధించిన గడువును పెంచి జరిగిన తప్పులు సరిచేయాలని, వెలిగండ్ల తాసిల్దార్ దృష్టికి తీసుకు వెళ్ళగా ఆమె వివరాలు, అభ్యంతరాలు రిపోర్ట్ రూపంలో ఇస్తే సరిచే స్తాము అని హామీ ఇచ్చారని తెలిపారు. నియోజక వర్గంలో ఉన్న మాదిగ, దళిత ఉపకులాల ప్రజలందరూ కూడా మీ మీ సచివాలయం దగ్గరకి వెళ్లి తమ కుల గణన సరిచూ సుకోవాల్సిం బాధ్యత నీపై ఉందన్నారు.

# పాఠశాలలను ఎంఈఓ తనిఖీ



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని సి.నాగుల వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అదేవిధంగా కోమటి గుంట్ల, చింతపూడు, నాగులవరం ప్రాథమిక పాఠశాలలను సోమవారం మండల విద్యాశాఖ అధికారి ఆర్.కొండారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి ప్రభుత్వ సూచనల ప్రకారం మెనూ అమలు చేసి నాణ్యతాయుతంగా రుచికరంగా అందించాలని వంట నిర్వాహకులకు ఎంఇఓ సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులను విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకుని నాణ్యమైన విద్య ను భోదించి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రధానమంత్రి పేచర్చ రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అదే విధంగా జనవరి రెండవతేది పియంసి కమిటీలకు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం సిఎస్ పురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పియంసి చైర్మన్, ప్రధానో పాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంఇఓ కొండారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ కొండారెడ్డి, ప్రధానోపాధ్యాయులు యం.కుమారి, శ్రీనివాసరాజు, కిరణ్ కుమార్, రవీంద్ర ఉన్నారు.

## నిరుపేద కుటుంబానికి సాయం



కర్లపాలెం, మేజర్‌న్యూస్: శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ బాపట్ల ఆధ్వర్యంలో ఒక వికలాంగుడికి 10 కేజీల బియ్యం, ఒక రగ్గు ,ఫౌండేషన్ అధ్యక్షులు పెనుమెత్స శివాజీ రాజు అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ రాజు మాట్లాడుతూ ప్రతి సోమవారం ఒక నిరుపేద కుటుంబానికి మా ఫౌండేషన్ ద్వారా పేదలకు మా వంతు సాయంగా సహాయ కార్యక్రమాలు నిర్వ హిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వేగిరాజు శ్రీనివాసరాజు, మంతెన సుబ్బ రాజు, పెనుమెత్స భార్గవ్ , బి జయ కృష్ణమోహన్ రెడ్డి, పి కళ్యాణ్ , బోయ పాటి భాస్కర్, తిరువీధుల రవికుమార్, ఏట్రా నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రెవెన్యూ గ్రామసభలను ఉపయోగించుకోవాలి



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం మండల గణపవరం గ్రామ పంచాయతీ లో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరమ్మ మాట్లాడు తూ పాస్ బుక్ లు,సర్వే కొలతలకులు , కాస్ట్ సర్టిఫికెట్ ల కోసం అర్జీలను ప్రజ లు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ దేవరకొండ అంకమ్మ ,ఇండో మెంట్ రవి కుమార్ ,సర్వేయర్ శ్రీరామామూర్తి,వి ఆర్ ఓ ఏ. శివారెడ్డి, ఆర్ ఐ రాజేంద్ర ,కార్యదర్శి సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం



కర్లపాలెం, మేజర్‌న్యూస్: ప్రకృతి వ్యవ సాయ ఉత్పత్తులచే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ప్రకృతి వ్యవ సాయం బుద్దాం యూనిట్ ఇంచార్జి మన్నెం సత్యనారాయణ అన్నారు. కర్లపా లెం రెవెన్యూ కార్యాలయం వద్ద ఐ సి పి ఆర్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవ సాయ ఉత్పత్తులు కూరగాయల స్టాల్ ను ఏర్పాటు చేసి అమ్మకాలు నిర్వహి ంచా రు. ఈ కార్యక్రమంలో ఐ సి ఆర్ పి లు నందిని,తిరుపతమ్మ ,స్యామేలు, భులక్ష్మి, భారతి,రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్లకు ఎస్సై సూచనలు



వేటపాలెం, మేజర్‌న్యూస్: పట్టణంలో ఆటో నడుపుతున్న డ్రైవర్లు అందరికీ ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు సోమవారం ఇస్తున్న ప్రత్యేక కౌన్సిలింగ్లో భాగంగా యూనిఫామ్, డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలని, ప్యాసింజర్స్‌ని ఎక్కువ గా ఎక్కించకూడదని సూచనలు ఇవ్వ డం ఇవ్వడంతోపాటు నూతన సంవత్సర సందర్భంగా తాగి ఆటోలు నడపకూ డదని హెచ్చరించడం జరిగింది.

## క్రీడాకారులకు అందుబాటులో బ్యాడ్మింటన్ ప్రాంగణం



బాపట్ల, మేజర్‌న్యూస్: జిల్లా కలెక్టర్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆదేశాల మేరకు క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బ్యాట్మెంటన్ క్రీడాకారులకు క్రీడా ప్రాంగణం సిద్ధం చేశామని తెలిపారు బాపట్ల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కే.పాల్ కుమార్. మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న క్రీడా వికాస కేంద్రం నందు రేపటినుండి అందుబాటులో ఉంటుందని ఆసక్తి కలిగిన క్రీడాకారులు స్లాట్స్ ప్రాకారం నమోదు చేసుకోవాలని ఉదయం 5 గం. నుండి 9 గం. వరకు మరల సాయంత్రం 4 గం.నుండి 9గం.వరకు ఇద్దరు లేదా నల్గురు క్రీడాకారులు స్లాట్స్ నమోదు చేసుకోవచ్చు అని తెలియజేశారు.ఉదయం 10 గం. నుండి సాయంత్రం 6 గం. జిల్లా ప్రాధికార సంస్థ కార్యాలయం అందుబాటులో ఉంటుందని మరిన్ని వివరాలు కొరకు జిల్లా క్రిడబివృది అధికారి కె. పాల్ కుమార్ 9290667994 కు సంప్రదించాలని కోరారు.

## నీలకంఠ పురంలో రెవెన్యూ సదస్సు



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని నీలకంఠపురం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు మండల తాసిల్దార్ దిలీప్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ గ్రామంలో మొత్తం 10 అర్జీలు వచ్చాయి. ఆన్లైన్ కొరకు-5 ఇతరుల పేరు తొలగిం చుటకు -2 జాయింట్ ఎల్పియం విభజన కొరకు - 2, ప్రభుత్వ భూమి సవరణ కొరకు 1 వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, గ్రామ రెవిన్యూ అధికారి గురుస్వామి, గ్రామ సర్వే అధికారి లక్ష్మీ నారాయణ, దేవాదాయ శాఖ ఈఓ శంకర్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతి రెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేటి నుండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను డిసెంబర్ 31వ తేదీన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్టు సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్ బాబు తెలిపారు. మండలంలో 6766 మంది వివిధ వర్గాల లబ్ధిదారులకు రెండు కోట్ల 87 లక్షల 6000 రూపాయల పెన్షన్లను పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో సురేష్ బాబు పేర్కొన్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల నుండి పెన్షన్లకు సంబంధించి నగదును డ్రా చేసినట్టు ఎంపీడీవో వెల్లడించారు. సచివాలయం సిబ్బంది ఈనెల 31వ తేదీన, జనవరి రెండో తేదీన లబ్ధిదారులు గృహలు వద్ద ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లను పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

## లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కనిగిరి టూ కంభం రోడ్డులో బైకులను ఆటోలను ఎస్సై కె.మాధవరావు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హటోలలో పరిమితిని మించి ప్రయాణికులు ఎక్కించుకోవటం వలన ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని అలాగే ప్రతి డ్రైవరు డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని బండి పత్రాలు ఇన్సూరెన్స్ రెన్యువల్ చేసుకోవాలని అన్నారు. అనంతరం ఈ చలానా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని సంతనూతలపాడులోని మోరియా ప్రార్థన మందిరంలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయకుమార్ పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. తన ఎన్నికల ముందు తన గెలుపు కోసం ప్రార్థనలు నిర్వహించిన సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో సుమారు 200 మంది పాస్టర్లకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ స్వచ్ఛందంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సంతనూతలపాడు మాజీ సర్పంచ్, బాపట్ల పార్లమెంటు టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి మోరియా ప్రార్థన మందిర పాస్టర్ డి. ఎఫ్రాయం అధ్యక్షత వహించారు. పాస్టర్ల అభివృద్ధికి తన వంతు కృషి చేయనున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాస్టర్లకు ఇళ్ల స్థలాలు, ప్రార్థన మందిరాలకు స్థలాలు కేటాయించాలని పలువురు పాస్టర్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్‌ను ఈ సందర్భంగా కోరారు. ఇందుకు కృషి చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. క్రిస్మస్, నూతన సంవత్సరంలో భాగంగా పాస్టర్లకు ఈ దుస్తులను పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు. సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో పాస్టర్లకు ఈ సందర్భంగా దుస్తులను ఎమ్మెల్యే విజయ్ కుమార్, ఎంపీపీ బుడంగుంట విజయ, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, మాజీ సర్పంచ్ ఆర్.అంకారావు, పాస్టర్స్ ఎఫ్రాయం,ఆర్డర్ బాబు, మహిళా నేత కే.పద్మ తదితరులు పంపిణీ చేశారు. అనంతరం పాస్టర్లకు అన్నదాన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల పాస్టర్ఫు పాల్గొన్నారు.

# టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న పువ్వాడి



పామూరు, మేజర్‌న్యూస్: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా టిడిపి పామూరు మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు రూ.లక్షతో ఆన్ లైన్ ప్రక్రియ ద్వారా సోమవారం తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు శాశ్వత సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పామూరు మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు ఎప్పటికీ అవసరం అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం పురోగమి స్తుందని పామూరు మండల ప్రజలం దరూ టిడిపికి మద్దతు ఇచ్చి తెలుగు దేశం పార్టీ సభ్యత్వాలు తీసుకోవాలన్నారు.

# నేడు రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పండగ: వేగేశన



బాపట్ల, మేజర్‌న్యూస్: ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఒక రోజు ముందుగానే ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు జనవరి 1వ తేది నూతన సంవత్సరం కావటంతో, డిసెంబర్ 31వ తేదీనే జనవరి నెల పెన్షన్ పంపిణీ చేయనున్నామని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలుగుదేశం, జనసేన , బీజేపీ పార్టీ నాయకులకు పిలుపు ఇచ్చారు. 31-12-2024 అనగా మంగళవారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల లోపు అధికార యంత్రాంగంతో పాటు వార్డులలో వార్డు ప్రెసిడెంట్లు, పంచాయతీలలో పంచాయతీ ప్రెసిడెంట్లు ఇంటింటికి తిరిగి పెన్షన్లను లబ్ధిదారులకు అందజే యాలి. బాపట్ల నియోజకవర్గంలో వార్డు ప్రెసిడెంట్లు, పంచాయతీ ప్రెసిడెంట్లు ఉదయం 6 గంటల నుండే పెన్షన్ లు పంపిణీ చేసి ఆ చిత్రాలను పార్టీ కార్యాలయాలకు సోషల్ మీడియాలో పోస్టు చేయాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పిలుపునిచ్చారు.

# లక్ష్య జాబ్స్ స్కిల్స్ అకాడమీ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ



గంగవరం, మేజర్‌న్యూస్: మండలంలోని తూర్పు గంగవరంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యూనిసెఫ్, నీట్ ఫౌండేషన్, లక్ష్య జాబ్స్ స్కిల్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో డిజిటల్ ప్రొడక్టివిటీ అనే కోర్స్ పైన విద్యార్థులకు శిక్షణ అందించడం జరిగింది. శిక్షణ అనంతరం మండల విద్యాశాఖ అధికారి సుధాకర్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది ఇప్పుటి వరకు దాదాపుగా 3500 మంది విద్యార్థులకు శిక్షణ అందించినట్లు బిఎఫ్ ఎస్సై ఒకేషనల్ ట్రైనర్ వై.అంజిబాబు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అరుణ కుమారి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలకు పాఠశాలలు ప్రాధాన్యత ఇవ్వాలని ఇచ్చినప్పుడు మాత్రమే విద్యార్థులు నైపుణ్యాలు పెరుగుతాయని విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉచితంగా అందజేసిన లక్ష్య జాబ్స్ స్కిల్స్ అకాడమీ వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుధాకర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ కుమారి, సీనియర్ ఉపాధ్యాయులు నాగిరెడ్డి, పవన్, విజయ కుమార్, ఒకేషనల్ ట్రైనర్స్ అంజిబాబు డేవిడ్లు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో నేలపాలైన వరి పంట, తడిసిన మిర్చి





త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: త్రిపురాంతకం మండలంలో ఇటీవల మూడు రోజులుగా వరుసగా కురిసిన ముసురువానకు వరి కోతకు వచ్చిన పైరు నేలపాలై రైతులు లబోదిబోమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కోతకు వచ్చిన మిర్చి మైదానాల్లో ఆరబోసుకోగా ముసురు వానకు తడిసి ఎండుమిర్చి రంగు మారి తాలు కాయలుగా మారిపోవడంతో మిర్చి యార్డులో కొనుగోలు దారులు తడిసిన మిర్చిని కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోగా కనీసం గిట్టుబాటు ధర కూడా కల్పించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికి ఆరబోసుకున్న మిర్చిపై వాన పట్టణం ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తే కొంతమేరకైనా ఎలాంటి వర్షాల నుండి పండిన పంట గింజ లను ఎండుమిర్చిని తడవకుండా చేసుకునేందుకు వీలవు తుందని మండల రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు జిల్లా అధికారులు త్రిపురాంతకం మండల రైతులపై దృష్టి సారించి నష్టపోయిన రైతులకు న్యాయం చేకూర్చాలని ప్రభుత్వానికి అధికారు లకు, నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయాన్ని కూడా 26వ తేదీన జిల్లా కలెక్టర్ వారు త్రిపురాంతకం మండల ంలోని ఎండూరు వారి పాలెం సందర్శించిన సందర్భంగా రైతులంతా కలెక్టర్కు విన్నవించుకున్నామని మండల రైతులు తెలియజేశారు.

## సోలార్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా

తాళ్లూరు, మేజర్‌న్యూస్: తక్కువ ఖర్చుతో ప్రతి ఇంటిపైన సోలార్ ఏర్పాటు చేసుకోవటం ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని విద్యుత్ శాఖ దర్శి డివిజన్ ఈఈ పాలగిరి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని నాగంబొట్లపాలెంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ సోలార్ పథకం వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం జిల్లాలో 5 గ్రామాల్లో పైలైన్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు.అందులో నాగంబొట్లపాలెం గ్రామం ఎంపిక అయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాయితీపై 1 కిలో వాట్స్ యూనిట్‌కి రూ.30 వేలు, 2కిలో వాట్స్ యూనిట్‌కి రూ.60వేలు, 3 కిలోవాట్స్ యూనిట్ పైన వాటికి 78వేలు రాయితీ ఇస్తోంద న్నారు. మొత్తం విలువ రూ.2 లక్షలు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమ ంలో దర్శి డీఈఈ డీవీ కృష్ణారెడ్డి, ఏఈ వీ.శ్రీనివాసరావు, ఎల్ఐ వీవీఎస్ కాంతారావు, లైన్ మెన్ కె.వెంకటేశ్వర్లు, సిబ్బంది మణికంఠ, సుబ్బారావు, అంజిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దొనకొండ, మేజర్‌న్యూస్: మండలంలోని పెద్దగుడిపాడు గ్రామానికి చెందిన గన్నేపల్లి ఆనంద్ రావు పనుల నిమిత్తం గంగదేవిపల్లి గ్రామానికి వెళ్ళి తిరిగి తన గ్రామానికి వచ్చు సమయంలో పెద్దగుడిపాడు ఎస్సీ కాలనీ సమీపంలో ఆటో ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. సమీపంలో ఉన్న వారు 108 వాహనాన్నికి సమాచారం అందించడంతో 108 సిబ్బంది ఇయంటి వెలుగొండయ్య, పైలెట్ నరేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. విషయం తెలుసుకున్న డిఇ రాజేంద్రప్రసాద్, డియం విజయ్ కుమార్ సిబ్బందిని అభినందించారు.

## నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

గిద్దలూరు, మేజర్‌న్యూస్: నగర పంచాయతీ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటలకు గిద్దలూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం పాముల వెంకటసుబ్బయ్య చైర్మన్ అధ్యక్షతన జరుగును. ఈ సమావేశానికి ముత్తుముల అశోక్ రెడ్డి శాసనస భ్యులు హాజరగుదురని డి.వెంకట దాస్ కమిషనర్ గిద్దలూరు నగర పంచాయతీ వారు ఒక ప్రకటనలో తెలియచేశారు.

## నాణ్యత ప్రమాణాలు లోపిస్తే చర్యలు తప్పవు

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: రహదా రులు నిర్మాణంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవు అని క్వాలిటీ కంట్రోల్ ఈఈ శ్రీనివాస రావు అన్నారు. తాళ్లూరు మండలంలోని గంగవరం నుండి జమ్మల మడక వరకు రోడ్డు మారమ్మత్తు లు నిర్వహించారు. ఆ రోడ్డును ఈఈ సోమవారం పరిశీలిం చారు. రోడ్డుకు వాడిన మెటీరియల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిఈ నాగేంద్ర బాబు, ఎఈలు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



## వైభవంగా శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఉత్సవం

టంగుటూరు, మేజర్‌న్యూస్: మండలంలోని కారుమంచి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అనంత కోదండరామి స్వామి వారికి, ఆంజనేయ స్వామి వారికి, శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారాలకు శని, ఆదివారం జరిగిన ఉత్సవములు శాస్త్రబద్ధంగా, వేద పండితుల వేద మంత్రాలతో వైభవముగా జరిగినవి. శనివారం జరిగిన తొలిరోజు ఉత్సవంలో శ్రీ ఆంజనేయ స్వామికి కారుమంచి గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు, అనంతరం శ్రీ కోదండ రామస్వామి వారికి సీతారామ కళ్యాణము కన్నుల పండగ నిర్వహించారు. ఆదివారము శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించి భక్తులు పరవశించిపోయారు. శ్రీ అన్నపూర్ణ దేవికి మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించి శ్రీ అన్నపూర్ణ దేవి వారి కృపకు పాత్రులు అయినారు. తదనంతరం ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ, మహా కుంభా హారతి పూజలు శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారికి, శ్రీ అన్నపూర్ణ దేవి వారికి నిర్వహించి శ్రద్ధ భక్తితో తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా భక్తులకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు. హైదరాబాదులో స్థిరపడిన 50కుటుంబాలసద్ బ్రాహ్మణులు, వేద పాఠశాల బ్రాహ్మణులు ఈ కార్యక్రమాలను నిర్వహించగా కారుమంచి గ్రామ మాజీ సర్పంచ్ ఆనం సత్యనారాయణ సారథ్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించగా కారుమంచి ప్రజలతోపాటు చుట్టూ ప్రక్క గ్రామాల ప్రజలు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలు లోపిస్తే చర్యలు తప్పవు:ఈ ఈ

ముండ్లమూరు మేజర్‌న్యూస్: రహదారులు నిర్మాణంలో నాణ్యతలోపిస్తే కఠిన చర్యలు తప్పవు అని క్వాలిటీ కంట్రోల్ ఈ.ఈ శ్రీనివాసరావు అన్నారు. తాళ్లూరు మండలం లోని గంగవరం నుండి జమ్మల మడక వరకు రోడ్డు మారమ్మత్తు లు నిర్వహించారు. ఆ రోడ్డును ఈ. ఈ సోమవారం పరిశీలించారు.రోడ్డు కు వాడిన మెటీరియల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డి.ఈ నాగేంద్ర బాబు, ఎ.ఈలు సుబ్రహ్మణ్యం, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా ప్రభుత్వంలోనే భూఆక్రమణలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



కొనకనమిట్ల, మేజర్‌న్యూస్: వైకాపా ప్రభుత్వంలోనే భూ అక్రమణలు , దౌర్జన్యాలు, ఇసుక మాఫియాలు ఎక్కువ జరిగాయని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మర్రిపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసిన తర్వాత భూ ఆక్రమణలు, భూములకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయని ఆ సమస్యలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్క రూపాయి చెల్లించకుండానే దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్జీకి 45 రోజుల్లోనే మీ సమస్యలకు పరిష్కారం చూపడం జరుగుతుందని అన్నారు. జగన్‌రెడ్డి ప్రజలు అనేక ఇబ్బందులు పాలయ్యారని గుర్తు చేశారు. ఆయన పరిపాలనలో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి తిరిగి ధర్నాలు చేయించడం సిగ్గు చేటు అన్నారు. ల్యాండ్ గ్రాభింగ్ చట్టంలో ఎవరు తప్పించుకోలేరని అన్నారు. ప్రజలు రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులో వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ ఆవుల సురేష్ ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ మహాదేవరెడ్డి, మండల సర్వేయర్ రాజశేఖర్ ,వీఆర్వోలు టిడిపి మాజీ కన్వీనర్ తాతిరెడ్డి వెంకటరెడ్డి, వెలుగొండ ఆలయ మాజీ చైర్మన్ కుందూరు కాశిరెడ్డి, గొట్లగట్టు సర్పంచ్ పెరిక సుఖదేవ్, టిడిపి నాయకులు కోడె గురవయ్య, ముప్వ కాటంరాజు, సాగనబోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు. గుర్రాల మడుగు,మర్రిపాలెం లో జరిగిన రెవిన్యూ సదస్సులో 22 అర్జీలు వచ్చినట్లు తాసిల్దార్ తెలిపారు.

# ప్రజలకు వారధిగా నేటి దినపత్రిక సూర్య



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: అవినీతి అక్రమాలు, నిజాలు నిర్భయంగా వెలుగు తీసే పత్రిక సూర్య నేటి దిన పత్రిక అని ఎంపీడీవో ఎంవి రమణ మూర్తి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో నూతన 2025 సూర్య క్యాలెండర్ ఆవిష్కరణ చేపట్టారు. ఎంపీడీవో ఎంవి రమణ మూర్తి తాసిల్దార్ బి.జనార్ధన్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా సూర్య పత్రిక పని చేస్తున్నట్టు ప్రజల మనలను అందుకోవడం అభినందనీయమన్నారు. సూర్య అంటే వెలుగు అని వారు పేర్కొన్నారు భవిష్యత్తులో ఈ పత్రిక ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ ఆవిష్కరణకు పంచాయతీరాజ్ జైఈ ఆర్డబ్ల్యూఎస్, జైఈ హౌసింగ్ ఏఈ ఈవో ఆర్‌డి ఎనర్జీ ఎస్ఏపీఓ మండల సర్వేర్, వెలుగు ఏపిఎం పంచాయతీరాజ్ జైఈ ఎం.శేషగిరిరావు, ఎం.జాన్ పాల్‌రాజు, ఎస్.సింగ్, ఏడుకొండలు, నాగరాజు, వై.బాబురావు, జయరాజ్, ఆర్‌ఐ ప్రసన్న, డెమొక్రటిక్ ఆఫ్ గ్రామ, వార్డు సచివాలయా ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 69/21 ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ షరీఫ్ మండల సూర్య రిపోర్టర్ షేక్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.



## టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న వెంగయ్య

### అభినందించిన ఎమ్మెల్యే ఉగ్ర

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలో తెలుగుదేశం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ టిడిపి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి నియోజకవర్గ పరిధిలో పార్టీ పరంగా మండలాన్ని ప్రథమస్థానంలో నిలిపిన మండల టిడిపి అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు (వెంగయ్య) తెలుగుదేశం అధిష్ఠానం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదులో శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో లక్ష రూపాయలు చెల్లించి టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఆదివారం కనిగిరి అమరావతి గ్రౌండ్స్ నందు ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో శాశ్వత సభ్యత్వాన్ని నమోదు చేసుకున్న వెంగయ్యను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నియోజకవర్గంలో తెలుగుదేశం కుటుంబసభ్యుల్లో ఆర్థిక స్థోమత కలిగిన ప్రతిఒక్కరు శాశ్వత సభ్యత్వం తీసుకుని పార్టీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న బొమ్మనబోయిన వెంగయ్యను ఆదర్శంగాతీసుకోవాలని తెలిపి వెంగయ్యకు టీడీపీ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే కందులను మర్యాదపూర్వకంగా కలిసిన కాసు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్



పొదిలి, మేజర్‌న్యూస్: మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారా యణ రెడ్డిని సోమవారం కాసు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాసు వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సాలువ కప్పి అభినందనలు తెలిపారు.

# ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు: ఎస్పీ





ఒంగోలు, మేజర్‌న్యూస్: ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించే దళారీలు మాటలు నమ్మవద్దు, జాబ్స్ ప్రతిభ ఆధారంగానే వస్తాయని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పోలీసు శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం ఉదయం 5గంటల నుండి ఒంగోలు పోలీసు కవాతు మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాకు చెందిన 5345 మంది అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనునట్లు తెలిపారు. అభ్యర్థుల ధ్రువ పత్రాలు పరిశీలిన అక్కడ నుంచి అభ్యర్థుల ఛాతికి, కాళ్లకు క్యూఆర్కోడ్, ఎత్తు, ఛాతి కొలతలు పూర్తి చేసుకున్న వారికి 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థుల దేహదారుఢ్య, పరుగు పరీక్షల వివరాలను సాంకేతిక పరిజ్ఞానంతో నమోదు చేసి భద్రపరస్తున్నట్లు, గ్రౌండ్‌లో 50 సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు సూచించిన నియమాల ప్రకారం ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లుగా పేర్కొన్నారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో, పారదర్శకంగా సీసీ కెమెరాల నిఘాలో, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, సాంకేతిక నిపుణుల సహకారంతో మొదటిరోజు ప్రశాంతంగా దేహదారుఢ్య పరీక్షలు పూర్తి చేయడం జరిగిందన్నారు. తొలిరోజు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావలసి ఉండగా 235 మంది అభ్యర్దులు బయోమెట్రిక్‌కు హజరయ్యారు.

అభ్యర్థులు ముందుగా రావాలని, అభ్యర్థుల ఈ ఈవెంట్స్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరరావు, పిటిసి డిఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీఓ ఏవో రామ్మోహన్‌రావు, ఐటి కోర్ సీఐ వి.సూర్య నారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాఘువేంద్ర, మహిళ పియస్ ఇన్స్పెక్టర్ సుధాకర్, పిటిసి సిఐ రాజేష్, ఆర్‌ఐలు రమేష్ కృష్ణన్, రమణారెడ్డి, డీపీఓ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిందే

### - కలెక్టరేట్ వద్ద నిరసనలో వామపక్ష పార్టీల నాయకులు ఆగ్రహం



ఒంగోలు, మేజర్‌న్యూస్: అంబేద్కర్ను దూషించడం అంటే రాజ్యాంగాన్ని అవమానపరచడమేనని వామపక్ష నాయకులు అన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై పలు అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రం హెూం శాఖ మంత్రి అమిత్ షా మంత్రి పదవికి పేషంట్‌గా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఐ, సిపిఎం ఒంగోలు నగర నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎం. రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ పార్లమెంటులో అంబేద్కర్ ను అవమానించారు అంటే భారత రాజ్యాంగాన్ని అవమానించినట్లే అని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. వెంకట్రావు, కే. వీరారెడ్డి, ఏం. విజయ, ఒంగోలు నగర సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్, గద్దల బాలకోటయ్య, ఆర్. లక్ష్మి, యు ప్రకాష్‌రావు, ఎం. సలార్, ఆదినారాయణ, డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సిపిఎం రాష్ట్ర నాయకులు జాల అంజయ్య, కంకణాలు ఆంజనేయులు, బి. రఘురాం, వి. బాలకోటయ్య, జయంత్ బాబు, ఏవి పుల్లారావు, కంకణాల రమాదేవి, సిపిఐ ఎంఎల్ నాయకులు సాయన్న, కోటేశ్వరరావు, పిఓ డబ్ల్యు రాష్ట్ర నాయకురాలు పద్మ, పిడిఎస్యు రాష్ట్ర నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

## శాశ్వత సభ్యత్వం తీసుకున్న టీడీపి నేతలు



కనిగిరి, మేజర్‌న్యూస్: కనిగిరి పట్టణ టీడీపి అధ్యక్షులు తమ్మనేని శ్రీనివాసులురెడ్డి, పట్టణ టీడీపి యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్‌లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు టీడీపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. సోమవారం స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో లక్ష రూపాయలు అందజేసి టీడీపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. శాశ్వత సభ్యత్వం తీసుకున్న తమ్మనేని శ్రీనివాసులు రెడ్డి, షేక్ ఫిరోజ్‌లను ఎమ్మెల్యే అభినందించారు.

